

బోరబండ సైట్-1 కాలనీలోని షహీద్ తుర్రెబాజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్



ఓటు హక్కును వినియోగించుకున్న ప్రేమ్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడు



రహ్మత్ నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలతో పోలింగ్ సరళిపై చర్చిస్తున్న ఆ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత



ఎర్రగడ్డలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో పోలింగ్ సరళిని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్



నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఓటర్లను పలకరిస్తున్న బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి



నటరాజ్ నగర్ పోలింగ్ బూత్‌లో రద్దీగా ఓటర్లు



ఎర్రగడ్డలోని 403వ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న 95 ఏళ్లు పైబడ్డ కులుసుంబీ, యూసుఫ్‌బీ



నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఓటరు సహాయ బూత్‌లు

పోలింగ్ ప్రశాంతం



డాన్‌బాస్కో స్కూల్లో ఉదయం ఓటర్లు లేక వెలవెలబోతున్న పోలింగ్ బూత్



మధ్యాహ్నం సమయంలో ఆక్స్ ఫర్డ్ స్కూల్లో క్యూ

బోరబండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెదురు మదురు ఘటనలు మినహా మంగళవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. బోరబండ, రహ్మత్ నగర్ డివిజన్ల పరిధిలో మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత కాస్త పుంజుకుంది. కొన్ని బూత్‌లలో ఓటర్లు ఇలా వెళ్లి అలా ఓటు వేసి రావడం కనిపించింది. ప్రధాన పార్టీలతోపాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులతో పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల సహాయార్థం ఓటరు సహాయ బూత్‌లు ఏర్పాటు చేశారు. వయోధికులు, దివ్యాంగుల కోసం వీల్ చైర్‌లు ఏర్పాటు చేసి సిబ్బంది సహకరించారు. బోరబండ రహ్మత్ నగర్ డివిజన్ల పరిధిలోని పోలింగ్ బూత్‌లను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు వి.నవీన్ యాదవ్, మాగంటి సునీతగోపీనాథ్, లంకాల దీపక్‌రెడ్డి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. అభ్యర్థులు, ఓటర్ల వాహనాలతో పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, సాయుధ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎర్రగడ్డ డివిజన్‌లో..

ఎర్రగడ్డ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లోని 63 బూత్‌లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. డాన్‌బాస్కో స్కూల్‌లోని బూత్ వద్ద మాత్రమే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, నిరసన తెలిపారు. 43 నుంచి 46 శాతం వరకు పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు.



ఓటు వేసిన సినీ రచయిత డాక్టర్ వెనిగళ్ల రాంబాబు దంపతులు



సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

జూబ్లీహిల్స్ నియోజకవర్గ బృందం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వెంగళరావునగర్‌లో సినీ రచయిత డాక్టర్ వెనిగళ్ల రాంబాబు దంపతులు, మధురానగర్‌లో సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, కార్పొరేటర్ దేదీప్యరావు తదితరులు ఓటు వేశారు.



ఓటు వేసిన కార్పొరేటర్ దేదీప్యరావు

ఓటర్లకు డబ్బులు పంచారు

● వివిధ పార్టీల నాయకుల పరస్పర ఆరోపణలు



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బొమ్మెర రామ్మూర్తి, లలితారెడ్డి

బోరబండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బులు పంచారంటూ ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు పరస్పరం ఆరోపించారు. బోరబండ బలహీనవర్గాల కాలనీ నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చిన వారికి కార్యకర్తలు అక్కడే డబ్బులు పంచి పెడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఒక పార్టీకి చెందిన కార్యకర్త డబ్బులు పంచుతుంటే తాము వీడియోలు, ఫొటోలు తీయడమే కాకుండా రూ.లక్ష పట్టుకున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బొమ్మెర రామ్మూర్తి, అడ్వకేట్ లలితారెడ్డి తెలిపారు. డబ్బులు దొరికిన తర్వాత అవి మరో పార్టీకి చెందినవి అంటూ బుకాయించారని చెప్పారు. దీనిపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వెంగళరావునగర్‌లో సినీ రచయిత డాక్టర్ వెనిగళ్ల రాంబాబు దంపతులు, మధురానగర్‌లో సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, కార్పొరేటర్ దేదీప్యరావు తదితరులు ఓటు వేశారు.



ఓటు వేసిన యువతి



చంటి పిల్లలతో ఓటు వేసేందుకు వస్తున్న మహిళ



కార్మికనగర్ పోలింగ్ కేంద్రం వద్ద యువత



షేక్‌పేటలో వృద్ధుడి తరలింపు



డ్రోన్ కెమెరాతో నిఘా..



వృద్ధుడిని తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది



ఓటు వేసిన తల్లీకూతుళ్లు



కరాటే కళ్యాణి



ఓటు వేసిన ముస్లింలు



షేక్‌పేటలోని ఓ బూత్‌లో పోలింగ్ ఏజెంట్లు



షేక్‌పేటలో పోలీసుల బందోబస్తు



ఓటు హక్కు వినియోగించుకున్న ఓ కుటుంబం



క్యూలో ఓటర్లు

అందెశ్రీకి అంతిమ వీడ్కోలు



అంతిమయాత్రలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు

తార్నాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లాలాపేట్‌లో సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందిన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ(64) పార్థివ దేహాన్ని మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు, అధికారులు అంత్యక్రియల నిమిత్తం లాలాపేట్‌లోని ప్రొ.జయశంకర్ స్టేడియం నుంచి ఘట్‌కేసర్‌కు తరలించారు. అందెశ్రీకి అంతిమ వీడ్కోలు పలికేందుకు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. కోదండరాం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావుతో పాటు, కవులు, కళాకారులు, స్థానికులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు భారీసంఖ్యలో అంతిమయాత్రలో పాల్గొని ఘనంగా వీడ్కోలు పలికారు.



అంతిమయాత్రలో ప్రొ.కోదండరామ్, అభిమానులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి

సీఎం ప్రజావాణికి 132 దరఖాస్తులు

బేగంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 132 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 41, రెవెన్యూకు 29, హోంశాఖకు 10, ఇందిరమ్మ ఇళ్ల కోసం 31, ప్రవాసీ ప్రజావాణికి 2, ఇతర శాఖలకు సంబంధించి 19 దరఖాస్తులు వచ్చాయని ప్రజావాణి ముఖ్య కార్యదర్శి దివ్య దేవరాజన్ తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి తెలిపారు.

నిర్మాత బెల్లంకొండ సురేష్‌పై కేసు

బంజారాహిల్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్‌పై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్ రోడ్డు నెంబర్.7లో శివప్రసాద్ అనే వ్యాపారి నివాసముంటున్నాడు. కొన్నిరోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. నిర్మాత బెల్లంకొండ సురేష్ అతడి అనుచరులు ఇంటిని ఆక్రమించేందుకు రెండు రోజుల క్రితం తాళాలు పగలగొట్టడంతోపాటు గోడలు ధ్వంసం చేశారు. విషయం తెలిసిన వెంటనే వచ్చిన శివప్రసాద్ తన మనుషులను సురేష్ ఇంటికి పంపాడు. వీరిపై సురేష్ దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గ్రూప్-3 ర్యాంకర్లు

మాకు ఒక అవకాశం ఇవ్వండి

● గ్రూప్-3లో 1:3కి ఎంపికైన ర్యాంకర్లు

పంజాగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటికే వివిధ ప్రభుత్వ విభాగాలలో ఉద్యోగం చేస్తున్న వారు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-3 ఉద్యోగాల వెబ్ ఆప్షన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావద్దని గ్రూప్-3లో 1:3కి ఎంపికైన ర్యాంకర్లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ర్యాంకర్లు వినయ్ కుమార్, శ్రీనివాసరావు, మోహన్‌కృష్ణ, మధు, శ్రావణ్, వెంకటేష్, తదితరులు మాట్లాడుతూ ఈనెల 29 వరకు గ్రూప్-3 వారికి వెబ్ ఆప్షన్స్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉందని తెలిపారు. ఉద్యోగం చేయాలనుకున్న వారు మాత్రమే డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం రావాలని కోరారు. సమావేశంలో పలువురు ర్యాంకర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయశంకర స్వామి

ఉగ్రదాడికి ఖండన

పంజాగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడిని జైహో జాతీయ సమితి తీవ్రంగా ఖండిస్తోందని, ఈ దాడికి పాల్పడ్డ ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని జైహో జాతీయ అధ్యక్షుడు విజయ శంకర స్వామి డిమాండ్ చేశారు. ఉగ్రవాదానికి దేశంలో స్థానంలేదని తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. జైహో జాతీయ ఉపాధ్యక్షుడు ఖయ్యూమ్ ఖాన్ మాట్లాడుతూ మతం వేరు మతోన్మాదం వేరని అన్నారు. మతోన్మాదులను దూరం పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జై భారత్ జాతీయ అధ్యక్షురాలు ఖదిజ్ఞాసి సైరా షేక్, జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోకనాథ్, జైహో రాష్ట్ర అధ్యక్షుడు ఖదిజ్ఞాసి డి.లక్ష్మేశ్వర్, షాజహాన, అన్సర్ పటేల్, డేవిడ్ పాల్, అన్వర్ పటేల్, మల్లిక వల్లభ, గణేశ్ గల్లా, శ్రీనివాసులు, ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా రీజెన్సీ కళాశాల ఫ్రెషర్స్ పార్టీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని రీజెన్సీ కాలేజ్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ హోటల్ మేనేజ్‌మెంట్ ఫ్రెషర్స్ పార్టీ 'రెగమేట్స్ 2025'ను నాగరంలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాటలు, నృత్యాలు, ఐస్ బ్రేకింగ్ గేమ్‌లు ప్రదర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక అవార్డులను అందజేశారు.

వృద్ధురాలిని మోసగించిన ముగ్గురి అరెస్టు

ఖైరతాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధురాలిని మోసగించి నగలు, డబ్బు బ్యాగ్‌తో ఉడాయించిన ముగ్గురిని సైఫాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, డీఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నంకు చెందిన విజయలక్ష్మి(65) ఈనెల 4వ తేదీన మెహిదీపట్నం నుంచి అమీర్‌పేటకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. మధ్యలో మరో ఇద్దరిని ఎక్కించుకున్న ఆటోడ్రైవర్ లక్డీకాపూల్ వద్ద ఇంజన్ వేడెక్కిందని, అందరూ కిందకు దిగి ఆటోను తోయాలని కోరాడు. విజయలక్ష్మి సైతం దిగగా ఆమె బ్యాగ్‌ను తీసుకొని పరారయ్యారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారించిన పోలీసులు ఆటోడ్రైవర్ మహ్మద్ ఒమర్(22)తోపాటు మహ్మద్ సమీర్(19), సయ్యద్ జహశార్ అలియాస్ ముషు(22)ను మంగళవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం



సునంద

ఖైరతాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాయగడ్‌కు చెందిన గొడ్ల సంతోష్ కుమార్ ప్రస్తుతం చింతల బస్తీ ప్రేమ్‌నగర్‌లో ఉంటున్నాడు. ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆగస్టులో కోరపాటి సునంద(32)తో వివాహమైంది. అప్పటి నుంచి చింతలబస్తీలో ఉంటున్నారు. సునంద అయిష్టంగా ఉంటుండడం గుర్తించి సంతోష్ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో సంతోష్ ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



బోయినపల్లి న్యూ సిటీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

ప్రమాదకరంగా మూల మలుపు

బోయినపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లిలోని న్యూ సిటీ కాలనీ వద్ద మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. బోయినపల్లి ప్రాంతంలోని జయనగర్, కంసారి బజార్, వపన విహార కాలనీ, ఎయిర్ లైన్స్ కాలనీ, చిన్న తోకట్ట, స్వర్ణ భారతి కాలనీలతో పాటు ఏడుగుడుల దేవాలయం, సాయిబాబా, వేంకటేశ్వర స్వామి దేవాలయాలకు వెళ్లాలంటే ఈ మూలమలుపు నుంచి వెళ్లాల్సిందే. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అయితే ఈ మూల మలుపు వద్ద కొన్ని సంవత్సరాలుగా నాలా కుంగిపోయి ఉంది. ఈ విషయమై కంటోన్మెంట్ బోర్డు అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో రెండు మూడు చోట్ల మూల మలుపులు ఉండటం వల్ల కొన్నిసార్లు ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న నాలాకు మరమ్మతులు చేయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమ్మవారి ఆలయంలో పూజలు

తిరుమలగిరి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లాల్‌బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన మహంకాళి దేవాలయంలో కార్తీకమాసం మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అర్చన, కుంకుమార్చన లాంటి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బొల్లారం డౌటన్‌బజార్‌లోని హనుమాన్ దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా ఈఓ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.



దీపోత్సవంలో ఈఓ మహేందర్‌రెడ్డి



జంపనను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా లక్ష దీపోత్సవం

సికింద్రాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా బోయినపల్లి పెద్దతోకట్టలోని ఉమామహేశ్వర, దత్తాత్రేయస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం కనులపండువగా జరిగింది. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో భక్తులు దీపాలు వెలిగించి దీపోత్సవ విశిష్టతను చాటారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. జంపన లావణ్య, కాసుల దామోదర్‌గౌడ్, కాశీ, స్వప్న, రమాదేవి, భారతి, శకుంతల, అపర్ణ, హేమలత, ఆలయ కమిటీ సభ్యులు బాబూరావు, సతీష్, నవీన్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పవర్‌బోర్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

అడ్డగుట్ట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజక వర్గం అడ్డగుట్ట డివిజన్ లోని అడ్డగుట్ట బి-సెక్షన్‌లో 2019లో సికింద్రాబాద్ మాజీ ఎంపీ బండారు దత్తాత్రేయ, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు హయంలో పవర్ బోర్‌ను ప్రారంభించారు. సింటెక్స్ ట్యాంక్‌కు పవర్‌బోర్ బిగించారే తప్ప విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేకపోయారు. ఆరేళ్ల నుంచి అనేకసార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడే పవర్ బోర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



2019లో ప్రారంభించిన ట్యాంక్

అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటన

మల్కాజిగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. కృపా కాంప్లెక్స్, ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో పర్యటించిన కార్పొరేటర్ సీసీరోడ్డు పనులను ప్రారంభించాలన్నారు. ఇదే ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ముందుగా భూగర్భ డ్రైనేజీకి సంబంధించిన పనులు చేపట్టాల్సిందిగా వాటర్‌వర్క్స్ అధికారును ఆదేశించారు. డ్రైనేజీ పనులు పూర్తి చేసిన తర్వాతే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ రాయగిరి లక్ష్మణ్, డీఈ మహేష్, ఏఈ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, వాటర్‌వర్క్స్ డీజీఎం రాజు, మేనేజర్ మల్లికార్జున్, సూపర్‌వైజర్ నాగార్జున, బీజేపీ నాయకులు మురళీ, నందుయాదవ్, శేఖర్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

అద్దె భవనాలు.. అరకొర వసతులు

కంటోన్మెంట్, మారేడుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిస్థితి

మౌలిక సదుపాయాలు కరువు.. పార్కింగ్ లేక అవస్థలు



మారేడుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



బోయినపల్లి కంటోన్మెంట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బోయినపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ శాఖలో అత్యంత కీలకమైనది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం. అయితే ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ప్రభుత్వాలు, పాలకులు మారినా పరిస్థితులు మాత్రం మారవు అనడానికి బోయినపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలే నిదర్శనం. బోయినపల్లి సెంటర్ పాయింట్‌లో దశాబ్దాలుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న కంటోన్మెంట్, మారేడుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అవస్థలపై సర్వత్రా ఆగ్రహం, అసహనం వ్యక్తమవుతుంది. అయితే మారేడుపల్లి, కంటోన్మెంట్ కార్యాలయాలకు సంవత్సరానికి లక్షల రూపాయల్లో అద్దె చెల్లిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోను, ఆ తర్వాత తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఇదే ప్రాంతంలోని అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయాల ద్వారా ఏటా కోట్ల రూపాయాల ఆదాయం సమకూరుతున్నా పరిస్థితి మారడం లేదు.

నిబంధనల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఆవాసాలు ఉండకూడదు. కానీ ఈ రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నివాసాలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. కానీ ఇక్కడ ఈ నిబంధనలు కనిపించవు. అలాగే ఇక్కడ పార్కింగ్ వసతి లేకపోవడంతో కార్యాలయం పక్కనే ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైనే పార్కింగ్ చేస్తుంటారు. దీంతో కార్యాలయాల ముందు నిలుపుతున్న ద్విచక్ర వాహనదారులకు పోలీసుల చలాన్లు తప్పడం లేదు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు ఇక్కడ ఎక్కువ సమయమే కేటాయించాల్సి ఉంటుంది. కానీ కార్యాలయాల్లో కూర్చోవడానికి బెంచీలు, తాగునీరు, మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం పడితే అంతే బయట కనీసం షెడ్డు కూడా లేని దుస్థితి నెలకొంది. ఇన్ని సమస్యలు ఉన్నా ఈ ప్రైవేటు భవనంలో ఎందుకు కార్యాలయాలు ఉన్నాయో సంబంధిత అధికారులకే ఎరుక. సంవత్సరాలు గడుస్తున్నా పరిస్థితులు మారడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



పార్కింగ్ స్థలం లేక రోడ్ల పైన వాహనాలు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిలిచిన మురుగు

ప్రతిపాదనలతోనే సరి

గతంలో తాడ్‌బండ్ చౌరాస్తాలో నిరుపయోగంగా ఉన్న స్థలంలో బోయినపల్లి, మారేడుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు తరలించి సొంత భవనం ఏర్పాటు చేయడానికి ఐదేళ్ల క్రితం ప్రతిపాదనలు చేశారు కానీ అవి కాగితాలకే పరిమితమైంది. ప్రస్తుతం సెంటర్ పాయింట్‌లో ఉన్న ఈ రెండు కార్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిగణనలోకి తీసుకుంటూ మౌలిక సదుపాయాలు ఉన్న కొత్త భవనంలోకి మార్చాలి. ఇప్పటికైనా బోయినపల్లి, మారేడుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై నిలిపితే కేసులు



బోయినపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ముందు రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. ఈ ప్రాంతం అసలే ఇరుకు రోడ్ దీనికి తోడు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతున్నది. దాంతో దారి మళ్లింపులు చేయడంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఎవరైనా సరే రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తే కేసులు తప్పవు.

- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జానకిరామ్

పార్కింగ్ తిప్పలు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వాహనాలు నిలపడానికి పార్కింగ్ స్థలం లేదు. మహిళలు వెళ్లడానికి టాయిలెట్స్ వసతులు లేవు. వర్షం పడిందంటే ఇక్కడ కష్టమే. కార్యాలయం ముందు వాహనాలు నిలిపితే ట్రాఫిక్ పోలీసులు కేసులు వేస్తున్నారు.

- ముజీబ్, మారేడుపల్లి





అందెశ్రీ అంతిమ యాత్రలో పాల్గొన్న మంత్రులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు

అందెశ్రీకి ఘన వీడ్కోలు

తార్నాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట్‌లో సోమవారం ఉదయం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందిన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ(64) పార్థివ దేహాన్ని మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు, అధికారులు అంత్యక్రియల నిమిత్తం లాలాపేట్‌లోని ప్రొ. జయశంకర్ స్టేడియం నుంచి ఘట్‌కేసర్‌కు తరలించారు. అందెశ్రీకి అంతిమ వీడ్కోలు పలికేందుకు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. కోదండరాం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావుతో పాటు, కవులు, కళాకారులు, స్థానికులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు భారీసంఖ్యలో అంతిమ యాత్రలో పాల్గొని ఘనంగా వీడ్కోలు పలికారు.



మాట్లాడుతున్న డాక్టర్ అరుణారెడ్డి

విద్యార్థులూ.. ఒత్తిడికి గురికావద్దు

రాంనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ అరుణారెడ్డి సూచించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల ఆవరణలో ఒత్తిడి, యాంగ్జైటింగ్, డిప్రెషన్ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక సమతుల్యత, ఆరోగ్యం మధ్య ఉన్న అనుబంధాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్, సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా వీరబోయిన లింగయ్యయాదవ్ నియామకం

రాంనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా వీరబోయిన లింగయ్యయాదవ్ నియమితులయ్యారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ విద్యార్థి సమావేశంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆయనకు నియామక పత్రం అందజేశారు. లింగయ్యయాదవ్ మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చినందుకు కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఏఐ ఎడ్యుకేషన్'పై 15న జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం మైనారిటీస్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 15న జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ ఇన్ ద ఈఆర్‌ఏ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సదస్సు పోస్టర్‌ను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ జి.నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఎస్.జితేంద్ర కుమార్ నాయక్ మంగళవారం విడుదల చేశారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను స్మరించుకునేదుకు ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు మైనారిటీస్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ హమీదా బీ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో విద్యా వ్యవస్థ రూపాంతరం, నైపుణ్యాభివృద్ధి, మానవ విలువలు వంటి అంశాలపై చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు.

భవానీ శంకర ఆలయంలో ప్రత్యేక పూజలు

ముషీరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భోలక్‌పూర్ దేవునితోటలో గల భవానీ శంకర ఆలయంలో సామూహిక కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్‌లు కార్తీక దీపాలను వెలిగించి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. మేడి సురేష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 20 వరకు స్వామివారికి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, సామూహిక దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రాజు ఆలయ సిబ్బంది సురేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి సంబంధాలు వెనక్కి వెళుతున్నాయని తీవ్ర మనస్థాపంతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బీబీనగర్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాలు ప్రకారం వరంగల్ ఆత్మకూర్ ప్రాంతానికి చెందిన సురేందర్ కుమారుడు నరేష్(30) అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్ ఉంటూ స్థానికంగా బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. సురేందర్‌కు పెళ్లి సంబంధాలు దగ్గరికి వచ్చి వెనక్కి వెళ్లిపోతున్నాయని, పెళ్లి కాదన్న వ్యధతో తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం బీబీనగర్ ఎలిమినేటి మాధవరావు రైల్వే బ్రిడ్జి కింద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని శవ పంచనామా చేస్తున్న సమయంలో మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ రింగ్ అయింది. మృతుడి స్నేహితుడు ఫోన్ చేసి ఎక్కడున్నావని ఫోన్‌లో మాట్లాడుతుండగా రైల్వే కానిస్టేబుల్ నారాయణ ఫోన్‌లో సమాదానం ఇచ్చారు. మీ స్నేహితుడు ఇక్కడ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారమిచ్చాడు. స్నేహితుడి నుంచి మృతుని వివరాలు తెలుసుకున్నారు. నరేష్‌కు ఐదేళ్ల నుంచి పెళ్లి సంబంధాలు వస్తున్నాయని, నచ్చక సంబంధాలు వెనక్కి వెళ్లిపోతున్నాయని స్నేహితుడు కానిస్టేబుల్‌కు చెప్పాడు. మృతుడు రేపల్లె రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.


మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

- **ఇద్దరికి మూడురోజుల రిమాండ్ విధించిన కోర్టు**

బోయినపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించింది. బోయినపల్లి ఎస్ఐ అవినాష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం 5న రాత్రి 12 గంటల ప్రాంతంలో ఆర్‌జీ విక్రమ్ తాడ్‌బండ్‌లోని ఓ వైన్స్ సమీపంలో నిలబడి ఉండగా బాపూజీనగర్‌కు చెందిన నందకుమార్, ఎ. క్రాంతి అనే ఇరువురు వ్యక్తులు తాగినమత్తులో అతడితో గొడవకు దిగారు. ఈ గొడవలో నిందితులు ఫిర్యాదుదారుడిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడు ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి మూడు రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం మత్తులో బహిరంగంగా ఇబ్బంది పెట్టడం, హింసాత్మక ప్రవర్తనలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది, అల్వాల్ పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ లోని ఏలూరు ప్రాంతానికి చెందిన సుధీర్(28), ఒడిస్సాకు చెందిన స్వప్నతో 4 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు, వీరికి వర్షిత్(2) కుమారుడు ఉన్నారు. సుధీర్ తాపి మేస్త్రీగా పనిచేస్తుండగా స్వప్న ఇళ్లల్లో పనిచేస్తుంది. యాప్రాల్‌ల్లో నివసిస్తున్నారు. కొంత కాలంగా చిన్న చిన్న విషయాల్లో భార్యభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం లోతుకుంటలో ఓ ఇంట్లో పనిచేసే వారి ఇంటి వద్ద భార్య స్వప్నను డ్రాప్ చేసి అల్వాల్ వీబీఆర్ కాలనీ సమీపంలో నివసించే తన సోదరి నివాసానికి సుధీర్ వచ్చారు. ఉదయం 12 గంటల సమయంలో ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుధీర్ ఆత్మహత్యకు ఖచ్చితమైన కారాణాలు వెల్లడికాలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, అధికారులు

సమగ్ర ప్రగతి దిశగా ఓయూ అడుగులు

- **ప్రిన్సిపాల్స్, డీన్స్, డైరెక్టర్లతో వీసీ ప్రణాళికా సమావేశం**

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం సమగ్ర ప్రగతి ప్రణాళిక రూపొందించేందుకు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ప్రిన్సిపాల్స్, డీన్స్, డైరెక్టర్స్, విభాగాధిపతులతో మంగళవారం సమావేశమయ్యారు. పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో అకాడమిక్ అడ్మినిస్ట్రేటర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గతేడాది విశ్వవిద్యాలయంలో అకాడమిక్ ఎక్సలెన్స్, పరిశోధనాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, నూతన ఆవిష్కరణలు విజయవంతంగా అమలయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయడం విశ్వవిద్యాలయానికి కొత్త ఊపు నిచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేంద్ర కుమార్ నాయక్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ లావణ్యలతో కలిసి విశ్వవిద్యాలయ ప్రగతిపై ప్రత్యేక బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రిన్సిపాల్స్, డీన్స్, డైరెక్టర్స్ పాల్గొని అభివృద్ధి సూచనలు అందించారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులు ● పోలీసులను ప్రశ్నిస్తున్న స్థానికులు



జామై ఉస్మానియా ప్రధానరోడ్డు రైల్వే ప్రహరీ పక్కన పార్కింగ్ చేసిన వాహనాలు

బౌద్ధనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు వాహనాల అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఎక్కడెక్కడి వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేసి వెళ్లిపోతుంటారని, జరగరాని సంఘటనలు జరిగితే ఎవరు బాధ్యులని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆ వాహనాలకు చలానాలు విధించి వెళ్లిపోతున్నారు. కానీ వాటిని తొలగించటంలో చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు తెలుపుతున్నారు. జామై ఉస్మానియా రైల్వేస్టేషన్, సిద్ధార్థ అపార్ట్‌మెంట్, జామై ఉస్మానియా నుంచి ఆర్ట్స్ కాలేజీ వచ్చే ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పదుల సంఖ్యలో వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేసి దర్జాగా వెళ్లిపోతుంటారని వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి అక్రమ పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొన్ని ఘటనలు

ఈ ప్రాంతాల్లో అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి కాల్చి వేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. అప్పట్లో పోలీసులు ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే ఇక్కడ జనసాంద్రత తక్కువ ఉండటం, రాత్రిళ్లు వీధి దీపాలు వెలగకపోవటంతో ఈ ప్రాంతం తాగుబోతులకు అడ్డాగా మారింది. రాత్రిళ్లు మహిళలు, స్థానికులు బయటకు రావాలంటే భయాబ్రాంతులకు గురవుతున్నారు. అక్రమ పార్కింగ్‌తోనే ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.



జామై ఉస్మానియా సిద్దార్థ అపార్ట్‌మెంట్ ముందు అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు

ఫిర్యాదు చేశాం



జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ ప్రధానరోడ్డులో ఉన్న సిద్ధార్థ అపార్ట్‌మెంట్ వద్ద వాహనాల అక్రమ పార్కింగ్‌తో చాలా అవస్థలు పడుతున్నాం. అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని గతంలో ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి వాహనాలను తొలగించాలని కోరుతున్నాం.

- బచ్చు విజయ్, సిద్ధార్థ అపార్ట్‌మెంట్ వాసి

అధికారులు స్పందించాలి



జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో విపరీతంగా వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. రైల్వేస్టేషన్‌కు, వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి పార్కింగ్ చేసుకోవటానికి ఉండటం లేదు. రైల్వేస్టేషన్ ముందు బస్టాండ్ ఉండటంతో అక్రమ వాహనాల పార్కింగ్ వల్ల ప్రయాణీకులు రోడ్లపై నిలబడాల్సిన పరిస్థితి. అధికారులు, పోలీసులు స్పందించి ఇలా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- గరిగె ప్రవీణ్‌కుమార్, టీడీపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు